# దైవరక్షితంబైన శిశువు

శ్రీమతి వరసా సీతారామమ్మగారు.

ఒకనాటి సాయంసమయమున నేను నా యనుంగు సహవాసపు కత్తెయగు వసంతయు మా గ్రామమునుండి అక్కగారివూరికి పోవుటకు ప్రయాణమైతిమి. నేనుండు పల్లెకును ఆ వూరికిని సుమారు అయిదు ఆరు మైళ్లుండును. అది సాయంసమయమగుటజేసి కొంత దూరముపోగా సూర్యభగవానుడు పడమటిదిక్కున నస్తంగతుడయ్యెను. ఆకసంబున పక్షులు దినంబంతయు నాహారంబునకై తిరిగి తిరిగి సంపాదించి వాటిని తమ చిన్న పక్షుల కిచ్చుటకై గూళ్లం జేరుచుండెను. సమస్త జనంబులును వారి వారి దినచర్యలు మాని విశ్రాంతికొరకు గృహంబులకుం జేరుచుండిరి. అయ్యది బహుళపక్షమగుటచే గాఢాంధకారము నతిత్వరితంబుగ నాలుగు వైపులం జుట్టుకొనియెను. అట్టి నిశీధసమయంబునందేనును నా చెలికత్తెయు నొక నదీతీరంబు జేరితిమి. ఆనదీతీరంబున దిరుగులాడు పక్షుల కిలకిలనాదంబులును, కాపువాండ్ర కేకలును, గూళ్లంజేరిన పిట్టల సరసపు వచనంబులును నాహృదయంబున జెప్పరాని భావంబుల నంకురింపజేసినవి. నేనును నా స్నేహితురాలును నా నదీతీరంబున బారులు తీరియుండు వృక్షంబుల మధ్యనుండి మాటలాడుచు బోవుచుంటిమి

అట్టి సమయంబున మిణుగురు పురుగులును, కాపువాండ్రు వేయు మంటలు, నీటి ప్రతిఫలింపులు నా హృదయంబు నాకర్షించి పరమానందము గలుగజేసినవి. అప్పుడు తటాలున నొకపసిబాలుడు సంతోషంబుచే కిలకిలమని కేకలువేయుట మిక్కిలి మాధుర్యంబైన గానంబువలె నా చెవులంబడినది. ఆ గానంబును నిశ్శబ్దుండనై యాలకించితిని. ఎచ్చటనుండి యాశబ్దము వచ్చుచున్నదని ఆబాలునకు ముందునకును వెనుకకును నా గాఢాంధకారములో తీక్ష్ణదృష్టులచే చూచితిని. అచ్చట ఏలాటి బండ్లసందడియు లేదు. పసిపిల్లల చంకనిడుకొని చనువారెవరు గాని బోడసూపరైరి. చుట్టుప్రక్కలయం దుండు పొలములలో నా సమయంబున మనుష్య సంచారము ఏమియూ లేదు. మాటిమాటికి ఆచిన్నబాలుని మృదుమధురమైన కేకలు స్పష్టముగ నా కుడిప్రక్కనఁ బాఱు నది యొక్క వొడ్డున వినిపించినవి. నే నంతట నా మార్గంబువదలి యానదీప్రవాహంబు వొడ్డుననే యిటునటూ పరికించుచూ నడువనారంభించితిని. ఆ చిన్నబాలుని వచ్చియురాని యఱపులు వినవచ్చుచుండెను.

అంత నే నచ్చోట కొంచెముసేపు నిలచితిని. నాఎదుట నీటికి సుమా రొక రెండు గజంబుల దూరంబున ఒకబాలుఁడు ఆరు మాసముల ప్రాయపువాడు కాళ్లు చేతుల గదలించుచు నాకసంబున దేదీప్యమానంబుగా ప్రకాశించెడు నక్షత్ర సముదాయంబుతో నాడుకొనుచు నొక యిసుక తిన్నెపై బరుండియున్నాడు. ఇదేమి యాశ్చర్యంబని తలంచి యాబాలుఁడు నీటిలో దొర్లి పడునేమోయనుభీతిచే నా చోటును జేరితిని. నాల్గువైపుల బరికించి చూచితిని. అంత నా బాలుని సమీపమునంజేరి చూడ నాతడు

కృష్ణరూపియై, నడుమున మొలతాడులేక చిటిసవ్వులు, కిలకిలధ్వనులతో నా యిసుక తిన్నెపై శయనించి యున్నాడు. ఆ యిసుక తిన్నెయే ఆ బాలునికి పానుపయ్యెను. అంత నేను "ఎవ్వరిచ్చట ? ఎవ్వరిచ్చట ? ఎవ్వరుగానరారే? ఈ బాలుడెవడు ?" అని పెద్దగా నఱచితిని.

నాయఱపుల కం దెవ్వరును ప్రత్యుత్తరః బొసంగరైరి. నదియందలి ప్రవాహము మఱింత శీఘ్రముగా బాఱజొచ్చెను. చీకట్లు దట్టముగా నాలుగువైపుల వ్యాపించెను. నేను యింకొకమాఱు బిగ్గఱగా నఱచితిని. ప్రవాహము విసుగుచే వెడలిపోయెను. అప్పుడు నా వూహాలకు మేఱలేదు. దుర్మార్గస్త్రీలెవరైనా యీశిశువు నిచ్చట వదలిరేమో? దొంగలు నగలకై దెచ్చి చంపచేతులు రాక నిట వదలిపోయిరేమో ? అంత నాబాలుని తడివితిని. ఎక్కడను అప్పుడు ప్రసవించిన నిసుగుగుర్తులులేవు. పుట్టి కొన్నిమాసంబులైనట్లు తోచినది. అప్పుడు నా భయంబునకు మేఱలేదు; పిశాచంబుల బిడ్డడేమో? దేహంబు జలదరించి యిటునటు చూచితిని. పాదములు చేతులు సరిగానేయున్నవి. ఎవ్వరో కావల యునని బరుండబెట్టినట్లు దోచినది. అంతట నేను కొంతధైర్యముదెచ్చుకొని చిటికెలు వేయుచు నా శిశువు నాడించుచుంటిని. ఆ శిశువు మొదట ఏడ్వనారంభించినను తుదకు నవ్వ నారంభించెను.

ఇట్లుండగా నా వెనుక "ఏ బాబమ్మగారు" అను నొక ధ్వనిరాగా నాగుండెలు దడదడమని కొట్టుకొనసాగెను. అంత ఒకస్త్రీ చీపురుకట్ట మోపొకటి తలపై నిడుకొని యా నదిని మెల్లమెల్లగా దాటి వచ్చుచుండెను. ఆమె వొక ఎఱుకుల చిన్నది. ఆమె తన జీర్ణాంబరమును సాధ్యమైనంతవరకు సర్దుకొని తలపైనుండు భారము నచటదింపి నవ్వుచు నచ్చట నాడుచున్న శిశువునెత్తుకొని నిలుచుండియే పాలిచ్చినది. చింపిరిజుట్టు నల్లని శరీరము చినిగిన వస్త్రము నామెను వికృతరూపిగా చేసినను మోమున కళ అంగసౌష్ఠవము నామె నెఱుకులవారిలో సుందరిగా చాటినయవి. అంత నాబాలుని వేఱొక గుడ్డతో గట్టిగా గట్టుకొని "ఏమీ బాబమ్మగారూ?" అని సన్న పలుకరించినది.

నిలుచుండి యింతవరకు మాట్లాడక వింత పడిచూచు నాకు కోపమువచ్చి నీకు బుద్ధి లేదటే ? బాలుని నీటివద్దవిడిచి వెళ్లినావు!! దొర్లిపోతే ? అడవిమృగములు తినిపోతే ? పాములు తేళ్లు కుట్టితే ? ఏమనుకున్న ఏమున్నది? అని చీవాట్లు పెట్ట నారంభించితిని. ఆమెనవ్వుచు నావంకజూచి "ఏంట్లోనండీ! మీకేమండీ యిళ్లూ వాకిళ్లూ వున్నాయి!! మాకు పొలాలు అడవులు బయళ్లేనండీ మా యిండ్లు." అని పలికి ఎక్కడవున్నావురో? యని కేకవేసింది. "ఆ" అని అనదివొడ్డున ఒకపొలములో నుండి ఒక ధృఢకాయుడు నల్లనివాడు ఎఱుకులవా డొకడు ఎలుకుల బుట్ట బుజానవేసుకొని గోచియు చినిగిన తలపాగయు గలిగి మాకడకువచ్చెను. ఎన్నెలకలు పట్టావురా? యని యామె యన్నది. నలభై మూడేయని వాడన్నాడు. పొలము కాపులు ఎలుకకు అర్ధణా యిచ్చెదరు.

హరినేత్రంబులు ఆ గాఢాంధకారంబున దేజరిల్లుట కనుగొంటిని. మోపునెత్తి మీద పెట్టావేమో యని పిల్చా. ఈ బాబమ్మగారు వెకలిస్తుండారు. అని నవ్వుచు చెప్పెను. 'ఏ' యని వాడేడవ ఆమె పిల్లవాని సమాచారము అంతయు వాడితో చెప్పినది. అంత నావంక దిరిగినవ్వుచు బాబమ్మగారూ! మాకేమిటండీ మేడలా మిద్దెలా! మేము చెట్టుక్రింద రాళ్లక్రింద నివశించాలీ. చెట్టుక్రింద అన్నంతినాలీ! భగవంతుఁడే మమ్మలను రక్షించాలి. నక్కలు అడవి మృగాలు మాకు చుట్టాలండీ" అనియెను. భార్యనెత్తిపై మోపెత్తిన తరువాత ఆ దంపతులిద్దరు నడువసాగిరి. నేనును వారితో కూడాబోతిని. వారు ప్రకృతిమాత శిశువులు. ప్రకృతియనిన వారికి భయమేమి? ఆ యెఱుకలదంపతులు వారి విచిత్రప్రేమవాక్యముల నానందించుకొనుచు పిల్లవానిని గారాబపుమాటలతో పలుకరించుచు నన్ను మఱచి పోవుచుండిరి. వారిజీవితముల మహానందము నాకుగూడ నెప్పుడును నుండవలయునుగదా యని పెద్ద నిట్టూర్పు విడిచితిని.

# పంచరత్నములు

బుక్కపురీ రామానుజాఖ్యుఁడు

వరకాంచీపురనాథా!
వరదా!వరదా!యటంచు వాకొనుచుం దిరా
నిరతము గొలిచెడి యేత
త్పురవాసులభాగ్యమహిమ పొగడఁ దరంబే॥
శ్రీమదనంతాచార్య
స్వామిని వేదాంతశాస్త్రిపారంగతునిం
మామకపరమాచార్యుని
నేమంబున గొల్చువాడ నిత్యము భక్తిం॥
శ్రీకాంచీప్రతివాద్యతి
భీకరపీఠస్థులుగను వేడ్కలరఁగ నీ
లోకంబున విలసిల్లుచు
సాకతమున శిష్యజనుల సాఁకవె యార్యా॥
ఆచార్యశేఖర! సాష్టాంగదండంబు
భూలోకగీష్పతి! బుద్ధి బుద్ధి
గురువర్య! గురువర్య! కోటినమస్కృతుల్
పరమపావనరూప! ప్రణతి ప్రణతి
భక్తశిఖామణి! భద్రముల్ మీ కగు
శ్రీదేశికవతంస! శ్రీ లెసఁగుత!
భాగవతాగ్రణి! భాగ్యముల్ పెం పొందు!
వేదవేదాంతజ్ఞ! వినతి వినతి
శ్రీమదణ్ణంగరాచార్య! శిష్టచర్య!
చారుగంభీరవాగ్ధుర్య! మేరుధైర్య!
దేవరాజదయాపాత్ర! దివ్యగాత్ర!
జయము!పాపగుల్మలవిత్ర! జయము!జయము!
నరనారాయణు లనియెడి
యిఁగపురలో నొక్క రగుచు నిలలో మీరల్
కరుణాతిరేకమున నవ
తరించి రటంచు నేను దలఁతును మదిలోన్॥
మింటిని దూర్యనినాదము
లంటెను; విప్రావళినిగమాగమఘోషల్
వింటిని వీనులవిందుగ;
కంటిని భూసురుల కొసఁగ ఘనదక్షిణలం॥

[శ్రీమత్కాంచీపుర ప్రతివాదిభయంకరపీఠస్థులును దిగంతవిశ్రాంతకీర్తులును నగు విద్వచ్ఛిరోమణి ఉ॥ వే॥ అనంతాచార్యస్వామి షష్టిపూర్తిమహోత్సవమునందు సమర్పించుకొన్న స్తోత్రము శ్రీమత్పరమపురుష పరమాచార్య స్వాచార్యస్తోత్రములు.]